# తల్లికోసం : :

రచన :
శ్రీ అందవిల్లి కొండలరావు

పద్మబాంధవుడు తన తీక్ష్ణకిరణాల చేతను ప్రపంచానంత వుడికింప చేస్తున్నాడు. వేడిగాలులు "రంయ్" మంటూ శరీరాలకు తాకి అగ్ని శగలవలె తపింప జేస్తున్నాయి. దేన్ని తాకినా అవి వేడిగానె వుంటున్నాయి. ఆకాశంలో మచ్చుకి ఓ పక్షికూడ సంచరించలేదు ఆయెండ తీవ్రానికి, చెట్లనీడను, ధనవంతుల యిండ్ల ముంగిళ్ళయందు కూలివాండ్రు, బిచ్చగాండ్రు నిద్రపోతున్నారు. వూరి చిట్టచివరనున్న పూరిగుడిశలో కుక్కి మంచంమీద జ్వరంతోను ఆకలితోను పడుక్కొని కొడుకురాకకై యెదురు చూస్తున్నది కామాక్షమ్మ.

పాపం! వారం రోజులునుంచి ఆమెకు ఎడతెగని జ్వరం. చిక్కి శల్యమైవుంది. రెండు రోజులునుంచి ఆజ్వరం తగ్గుముఖంపట్టినా తగినంత ఆహారం లేకపోవడంవల్ల మంచంనుంచి లేవడానికికూడ అశక్తురాలై వుంది.

ఒక మూల వేడిగాల్పులు, ఒకవైపు ఆకలిబాధ. ఒకసారి కొడుకేమయ్యాడో అన్న బెంగ, ఇవన్నీ ఆమెను మరింత క్రుంగదీస్తున్నాయి.

తామిద్దరూ యిలా దరిద్రులై వుండడం చేతకదా బంధువులు, స్నేహితులు పలకరించడానికైనా రాలేదు. పైగ సహాయం చేస్తారా? డాక్టరుకూడ డబ్బిస్తేగాని మందివ్వనన్నాడు. ఆహా! బీదవారంటె యీ మానవులకెంత చులకన! ఏ బాధవల్లనైనా చచ్చిపోతున్నా కనికరించని యీ ధనవంతులుకూడ ఒక మానవులేనా?

తన దీనస్థితికి కామాక్షమ్మ దుఃఖిస్తున్నది. లోతుకి దిగిపోయివున్న ఆమె కండ్లనుంచి నీటిబిందువులు "టప్‌టప్" మంటూ పక్కమీద పడ్డాయి. ఏడ్వడానికికూడ అశక్తురాలై వుంది.

కాళ్ళు కాలిపోతున్నా, తల్లి యెలావుందో అన్న ఆతృతతో లక్ష్యం చెయ్యక మూర్తి వడిగా నడుస్తున్నాడు.

పొద్దున్నుంచి వుద్యోగంకోసమని ఆఫీసులన్నీ తిరగడంవల్ల మూర్తి బాగా అలసిపోయాడు. కాళ్ళు లాగుతున్నాయి. క్రింద నడుస్తుంటె కాళ్ళు కాలిపోతున్నాయి. మీద తల మండిపోతున్నది. వేడిగాలి చెవుల్లో దూసుకు పోతున్నది. ఆకలి దాహాలు వీటిని మించివున్నాయి. చెమట్లు (స్నానంచేస్తున్నప్పుడు నీరు పడేవిధంగ) మూర్తి శరీరంనుంచి క్రింద పడ్తున్నాయి. తన బాధ గమనించకుండ వేగంగ అతడిల్లు చేరుకొందుకి ప్రయత్నం చేసేడు.

పావుగంటకి యెలాగైతేనేం, మూర్తి తన పూరిగుడిశ చేరుకొన్నాడు. లోపల్నుంచి "అబ్బా! ఆకలి, దాహం! అంటూ బాధపడ్తున్న తల్లిని సమీపించాడు. ఆమె బాధతో కళ్ళుమూసుకొని వుండడంచేత కొడుకురావడం చూడ్లేదు.

"అమ్మా!" అంటూ, మూర్తి మంచం దగ్గిర కూర్చుని ఒంటినివున్న చెమటను తుడ్చుకున్నాడు.

"వచ్చేవా, నాయనా! యింత ఆలస్యం చేసావెందుకు?" కళ్లు విప్పుతూ మూర్తిని

చూసి ప్రశ్నించింది. తన చినిగిన చీరకొంగుతో కొడుకు ముఖానవున్న చెమటను తుడుస్తూ మధ్యమధ్య మూలుగుతూవుంది.

"అమ్మా! ఎక్కువ చదువు చదివీకూడ నిన్ను పోషించలేక పోతున్నాను. పొద్దున్నుంచీ తిరుగుతూ యెందర్ని బ్రతిమాలినా వుద్యోగమెవ్వరూ యివ్వలేదు."

"పోనీలే, నాయనా! మనం యిలాగే యీ విధంగానె వుండిపోతామా? మనరోజు లెప్పుడైనా బాగుపడక మానవ్. ఇందుగురించి మరేమీ మనస్సు పాడుచేసుకోక."

"అమ్మా! పాపం, రెండు రోజులునుంచి నువ్వేమీ భోంచేయలేదు. ఎవర్నైనా అడిగి నీకోసమైనా పట్టెడన్నం తెస్తాను." అంటూ లేచేడు. "పాపం! యీ యెండలో యెందుకు నాయనా శ్రమపడ్తావ్. చల్లబడిన తర్వాత వెల్దువుగాని." అంటూ కామాక్షమ్మ కొడుకుని వారించింది. కాని ఆమె స్థితి చూస్తున్న మూర్తికి కాళ్ళు నిలబడ్డంలేదు.

"అమ్మా! క్షణంలో యిప్పుడే వచ్చేస్తా. మరేమీ బెంగపడక." మూర్తి మరి క్షణమైనా అక్కడ నిలవక మెయిన్ రోడ్డువైపు పరుగెత్తేడు.

ఓ అరగంటసేపు అయిన తర్వాత కామాక్షమ్మ కళ్ళువిప్పి చూసింది. ఎదుట కొందరి చేతపట్టుబడ్డ కొడుకు అతని చేతిలోవున్న "కేరేజ్" కనుపించాయి ఆమెకు. "ఎవరు నాయనా! వారు? ఎందుకలా నిన్ను పట్టుకొన్నారు!" ఆశ్చర్యంతో ప్రశ్నించింది కామాక్షమ్మ.

"అమ్మా! ధనవంతులు యెంత దొంగతనం చేసి డబ్బు దోచుకొంటున్నా వార్నేమీ అన్లేక లంచాలు పుచ్చుకొని అమాయకులగు బీదలను పీడించే ఘరానా మనుష్యులు వీరే, కాళ్ళమీద పడి బ్రతిమాలినా పట్టెడన్నం పెట్టక బంట్రోతుచే గెంటింప జూచిన ఆ అయ్యరుని కొట్టి యీ అన్నం కేరేజీ తీసుకొస్తుంటె నన్నీ పోలీసులు పట్టుకొన్నారు. నా మాటకేంగాని అమ్మా! యీ అన్నం కాస్త తిను." అంటూ కేరేజ్‌లోంచి యింత అన్నం తీసి తల్లిదగ్గరకు తెచ్చేడు. ఆమె పోలీసులన్న మాట వింటు వింటుండే శాశ్వతంగ కన్ను మూసింది. తల్లిని కదిపించి చూసేడు మూర్తి. ఆమె చనిపోయిందన్న సంగతి తెలియగానే శవంమీద పడి కన్నీరుకార్చేడు. ఆవిధంగానే కన్నీరు కాదుస్తూ పోలీసులతో వెళ్ళిపోయేడు, పాపం! మూర్తి.


కథాంజలి
(కథల మాసపత్రిక)

విడిప్రతి 0-4-0
సంవత్సరచందా 4-0-0
(ప్రత్యేక సంచికతోసహా)

అన్ని హిగ్గిన్ బాదమ్స్ బుక్ స్టాల్స్‌లోనూ దొరకును.